సాక్షి జగిత్యాల
శనివారం | 12 | అక్టోబర్ | 2024




## విజయీభవ

- నేడు విజయదశమి
- షమీ పూజకు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్(కరీంనగర్): సకల జగత్తుకు మూలం. త్రిమూర్తులకు శక్తిప్రదాత. త్రిలోకేశ్వరి దుర్గామాత దుష్ట శిక్షణ గావించిన రోజున విజయదశమి జరుపుకోవడం ఆనవాయితీ. విజయదశమి వేడుకల్లో భాగంగా శమీ వృక్షాన్ని పూజించడం, వాహన, పనిముట్లకు ఆయుధపూజలు చేయడం సంప్రదాయం. తెలంగాణా ప్రాంతంలో ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకునే అతిపెద్ద పండుగ దసరా. ఈ రోజు చేపట్టిన ప్రతీ పనిలో విజయం లభిస్తుందని నమ్మకం. దసరా రోజు సాయంత్రం పాలపిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉంది. నేటి దసరాకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు.

## న్యూస్‌రీల్

### సిద్ధిధాత్రి రూపంలో అమ్మవారు



ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు సిద్ధిధాత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర, నవదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన చండీహోమం కార్యక్రమంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల: ఆది పరాశక్తి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. విజయదశమి పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ, ప్రజలందరికీ ఈ సంవత్సరం విజయం కలగాలని ఆకాంక్షించారు.

# 'జగిత్యాల'కు ఎనిమిదేళ్లు

### అంచలంచెలుగా ఎదిగిన జిల్లా

జగిత్యాల: జగిత్యాల అంచలంచెలుగా ఎదుగుతూ జిల్లా కేంద్రంగా ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతుంది. జిల్లాగా అవతరించిన అనంతరం కలెక్టరేట్‌తో పాటు, ఎస్పీ ఆఫీసు, మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారు. 1952లో థర్డ్‌గ్రేడ్ మున్సిపాలిటీగా అవతరించిన జగిత్యాల కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద బల్దియాగా గుర్తింపు పొందింది. అప్పటి నుంచి పట్టణం విస్తరిస్తూ ప్రస్తుతం గ్రేడ్–1 మున్సిపాలిటీగా కొనసాగుతోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్ జగిత్యాలను జిల్లాగా ప్రకటించారు. 2016 అక్టోబర్ 11న అప్పటి ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ జగిత్యాల జిల్లా కేంద్రాన్ని ప్రారంభించారు. గతంలో 25 వేల జనాభాతో ప్రారంభమైన బల్దియా ప్రస్తుతం 1,60,683 జనాభాకు చేరింది.

**20 మండలాలతో..**

మొదట ప్రభుత్వం జగిత్యాలను 18 మండలాలతో జిల్లాగా ప్రకటించగా, అనంతరం బీమారం, ఎండపల్లి మండలాలు ఏర్పడ్డాయి. జిల్లాగా ఏర్పడిన అనంతరం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. అలాగే జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్లను ప్రారంభించారు. దీంతో రెవెన్యూ సేవలకు దూర భారం తగ్గింది.



కలెక్టరేట్ సముదాయం

**నూతన కార్యాయాలతో కళకళ**

జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనంతరం 54 శాఖలతో కూడిన కలెక్టరేట్ సముదాయం నిర్మించడంతో పాటు, అత్యాధునిక హంగులతో ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల ఏర్పడ్డాయి. ధరూర్ క్యాంప్‌లోని ఎస్సారెస్పీ భూముల్లో వీటిని నిర్మించారు. ప్రస్తుతం అవి జిల్లాకే ఐకాన్‌గా మారాయి.



ఎస్పీ కార్యాలయం

## జగిత్యాల, మోతె ప్రజల మైత్రికి చిహ్నం జంబిగద్దె

- విజయనగరం తర్వాత జగిత్యాలలోనే గద్దె
- నేడు దసరా
- వేడుకలకు ఏర్పాట్లు చేసిన అధికారులు



జంబిగద్దె

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జంబిగద్దెకు ప్రత్యేక స్థానం ఉంది. జగిత్యాల, మోతె ప్రజలు ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా కలిసిమెలిసి ఉండాలనే ఉద్దేశంతో పట్టణంలోని అశోక్‌నగర్ ప్రాంతంలో ప్రత్యేకంగా జంబిగద్దెను ఏర్పాటు చేసినట్లు పెద్దలు చెబుతారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరంలో రాజులు జంబిగద్దెను ఏర్పాటు చేయగా జగిత్యాలలో సైతం ఆ విధంగానే ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. ఏటా విజయదశమి రోజు జంబిగద్దె వద్ద జంబిచెట్టు ఏర్పాటు చేసి పూజ చేస్తారు. అనంతరం ప్రజలందరూ జంబి పెట్టుకుని అలాయ్‌బలాయ్ చెప్పుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. విజయదశమిని పురస్కరించుకుని జంబిగద్దెను ముస్తాబు చేశారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు.

**పరిశీలించిన ఎస్పీ**

జగిత్యాలక్రైం: దసరా పురస్కరించుకుని వేడుకలు జరిగే జంబిగద్దెను ఎస్పీ అశోక్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ రఘుచందర్, సీఐలు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, ఎస్సైలు కిరణ్, మన్మదరావు ఉన్నారు.



జంబిగద్దెను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, పోలీస్ అధికారులు

## ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకోవాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో నియోజకవర్గంలోని 208 మంది లబ్ధిదారులకు రూ.59,18,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసి మాట్లాడారు. పేదలకు అండగా నిలిచేందుకు సీఎం సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కొత్త మోహన్, మసర్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**రతన్‌టాటాకు భారతరత్న ఇవ్వాలి**

తన వ్యాపారాల్లో వచ్చిన లాభాల్లో సగానికి పైగా ప్రజల అవసరాలకు కేటాయించి దానధర్మాలు చేయడంలో పెద్ద మనసుచాటిన వ్యాపారా దిగ్గజం రతన్‌టాటాకు భారతరత్న ఇవ్వాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రతన్‌టాటా మృతి పట్ల నివాళి అర్పించారు.

## ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ బస్సు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ బస్సును ఏర్పాటు చేశామని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ధర్మపురి పుణ్యక్షేత్రం నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఏర్పాటు చేసిన బస్సును శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ఏసీ బస్సు రోజూ రాత్రి 11.30 గంటలకు ధర్మపురి నుంచి హైదరాబాద్ బయలుదేరుతుందని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో ధర్మపురిలో బస్‌డిపో ఏర్పాటుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఏసీ బస్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రోడ్డు రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఏసీ బస్సును ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్



## వడ్డీ వ్యాపారుల ఇంటి ఎదుట మహిళల ఆందోళన

మెట్‌పల్లి(కోరుట్ల): బంగారం తాకట్టు పెట్టుకొని అప్పు ఇచ్చిన వ్యాపారులు.. తిరిగి అప్పు డబ్బులు తీసుకొని బంగారం ఇవ్వడానికి నిరాకరించడంతో బాధిత మహిళలు శుక్రవారం వారి ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. వివరాలు.. పట్టణానికి చెందిన బంగారం వ్యాపారి రాకేశ్ సుమారు 850 మంది వద్ద బంగారు ఆభరణాలను తీసుకొని వాటిని వడ్డీ వ్యాపారం చేసే కట్కం ప్రకాశ్, రమేశ్ వద్ద తాకట్టు పెట్టి వారికి అప్పులు ఇప్పించాడు. అయితే వ్యాపారంలో రాకేశ్ దివాళా తీయడంతో విషయం తెలుసుకున్న బాధితులు ఇటీవల అతడి వద్దకు వెళ్లి తమ బంగారం ఇప్పించాలని కోరారు. దీనికి అయన తాకట్టు పెట్టిన వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లి అడుగగా, వారు బంగారం ఇవ్వడానికి నిరాకరించారు. దీంతో రాకేశ్ బాధిత మహిళలతో కలిసి వ్యాపారుల ఇంటి ఎదుట ఉన్న జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఎస్సై చిరంజీవి ఘటన స్థలానికి వెళ్లి బాధితుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సుమారు 8కేజీల బంగారం వారి వద్ద తాకట్టు పెట్టడం జరిగిందని..అప్పు తీసుకున్న వారంతా ఇప్పుడు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని ఎస్సైకి రాకేశ్ తెలిపాడు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడి బంగారం ఇప్పిస్తానని ఎస్సై చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న మహిళలు



## సైబర్ మోసం.. రూ.60 వేలు మాయం

కథలాపూర్(వేములవాడ): ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురై, రూ.60 వేలు పోగొట్టుకున్న ఘటన కథలాపూర్ మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుతుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి, మీకు ఎల్ఐసీ పాలసీకి సంబంధించిన బోనస్ వచ్చిందని నమ్మించాడు. మీ అకౌంట్‌లో కొంత డబ్బు జమ అయిందని, మిగతా డబ్బులు కావాలంటే తాను చెప్పిన సూచనలు పాటించాలన్నాడు. చెప్పినట్లు చేయడంతో కొద్దిసేపటికి బాధితుడి ఫోన్ పే నుంచి రూ.60 వేలు మాయమయ్యాయి. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన అతను సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాడు. ఈ ఘటనపై సైబర్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం పేర్కొన్నారు.

## శ్రీలక్ష్మీనృసింహునికి పొన్నచెట్టు సేవ



సారంగాపూర్(జగిత్యాల): శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారలకు పొన్నచెట్టు సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకిలో ఆసీనులను చేసి పొన్నచెట్టు వద్దకు తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. అర్చకులు వొద్దిపర్తి పెద్దసంతోష్, చిన్న సంతోష్, మధుకుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జనావాసాల్లోకి రోల్లవాగు నీళ్లు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ శివారుల్లోని రోలవాగు ప్రాజెక్టు నీరు శుక్రవారం కండ్లపల్లి గ్రామంలోకి చేరడంతో గ్రామంలో ఒకింత ఆందోళన వ్యక్తమైయింది. రోల్లవాగు నీటిని దిగువనున్న పంటలకు విడుదల చేసేందుకు శుక్రవారం గుర్తుతెలియని రైతులు కండ్లపల్లి బుగ్గచెరువు వైపు ఏర్పాటు చేసిన మూడవ తూము గేట్లను ఎత్తి ఎక్కువ మొత్తంలో తమ పొలాలకు నీరు వదిలారు. ఈక్రమంలో నీళ్లు కండ్లపల్లి గ్రామంలోకి చేరడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూ అధికారులకు సమాచారం అందించారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో గ్రామస్తులే ప్రాజెక్టు వద్దకు వెళ్లి గేట్లు మూసివేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్వహణ విషయంలో పర్యవేక్షణ కొరవడడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని కండ్లపల్లివాసులు అధికారుల తీరును తప్పుపడుతున్నారు.



కండ్లపల్లి గ్రామంలో రోల్లవాగు నీళ్లు

## అటవీశాఖ కార్యాలయంలో దావత్



దావత్‌లో ఉద్యోగులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఉద్యోగులు దావత్ ఏర్పాటు చేసుకున్నారు. మీడియా అక్కడికి చేరుకోవడంతో కొంత మంది ఉద్యోగులు అక్కడి నుంచి జారుకోగా మరికొంత మంది అక్కడే ఉంటూ నానా హంగామా సృష్టించారు. ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులే మందుతాగుతూ విందు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై అటవీశాఖ అధికారి రవిప్రసాద్‌ను వివరణ కోరగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాల క్రైం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. జగిత్యాల పట్టణ ఎస్సై కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అరవింద్‌నగర్‌లో ఉంటున్న తిరుమల్ రావు గురువారం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామం సుల్తానాబాద్ వెళ్లాడు. శుక్రవారం ఉదయం తాళం పగులగొట్టి ఉండటంతో స్థానికులు ఆయనకు సమాచారం అందించగా ఇంటికి వచ్చాడు. బీరువాలోని 8 తులాల బంగారం, రూ.50 వేలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## కమ్మరిపేటలో శతాధిక వృద్ధురాలి మృతి



గంగమ్మ (ఫైల్)

మేడిపల్లి(జగిత్యాల): మేడిపల్లి మండలంలోని కమ్మరిపేటకు చెందిన గంగమ్మ(107) మృతిచెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గంగమ్మకు ముగ్గురు కూతుళ్లు. కొన్నేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయాడు. వందేళ్లు దాటినా ఆమె ఆరోగ్యంగా బతికింది. ఎవరి సాయం కోరలేదు. ఎవరితోనూ గొడవపడలేదు. రెండు, మూడు రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడింది. గురువారం రాత్రి నిద్రలోనే చనిపోయింది. శుక్రవారం అంత్యక్రియలు జరుపగా గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా, మృతురాలికి కూతుళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు తదితరులు 50 మందికి పైగా ఉన్నారు. అందరూ కలిసి గంగమ్మ 105వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.